'ఆడుదాం ఆంధ్రా'ను సద్వినియోగం చేసుకోవాలి

• ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్:

ఆడుదాం ఆంధ్రా క్రీడలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతలో ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను పెంపొందించి ఆంధ్రప్రదేశ్‌ను క్రీడాశక్తిగా మార్చడం ఈ క్రీడల లక్ష్యమన్నారు. గ్రామీణ నేపథ్యం కలిగిన వారి ప్రతిభను ప్రదర్శించడానికి అవకాశం కల్పిస్తూ క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. రూ.12కోట్ల విలువైన బహుమతులు, కిట్లను ఈ క్రమంలో అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, మున్సిపల్ కమిషనర్ రామప్పల నాయుడు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు. అలాగే నియోజకవర్గంలోని సీతానగరం, బలిజిపేట మండలాల్లో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి.

ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభం

సాలూరు: మున్సిపాలిటీ, సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు సాలూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మున్సిపల్‌చైర్‌పర్సన్‌పువ్వల ఈశ్వరమ్మ పోటీలను ప్రారంభించారు, పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు చైర్‌పర్సన్‌తో పాటు వైస్‌చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైస్‌ఎంపీపీ రెడ్డి సురేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి తదితరులు ఆల్‌దబెస్ట్ చెప్పారు. ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ పోటీలను పరిశీలించారు.



పార్వతీపురం టౌన్: క్రీడాకారులకు కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు



సీతానగరం: బూర్జ నుంచి క్రీడాస్థలి వరకూ పాదయాత్రగా వస్తున్న సచివాలయ సిబ్బంది, క్రీడాకారులు



బలిజిపేట: చాకరాపల్లి సచివాలయంలో పోటీలను ప్రారంభించిన సర్పంచ్ మోహనరావు



మక్కువ: క్రీడాకారులతో మావుడి సోదరులు



సాలూరు: పోటీలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్



సాలూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటిలను ప్రారంబిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ



పాచిపెంట: వాలీబాల్ ఆటను ప్రారంభిస్తున్న ఎంపీపీ బి ప్రమీల



సీతానగరం: జోగింపేటలో క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీఓ కె. హేమలత

క్లుప్తంగా

వేడుకగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పార్వతీపురం: పట్టణంలోని బంగారమ్మ కాలనీలో శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రముఖ యజ్ఞకర్త, అసంఖ్యాక దేవాలయ ప్రతిష్టాపకుడు ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో ఆగమశాస్త్ర యుక్తంగా విగ్రహ ప్రతిష్టను బలగ నారంనాయుడు, భారతి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతిష్ట కార్యక్రమంలో మహిళలు అధికంగా పాల్గొన్నారు. శ్రీ సాయిరాం రామ దక్షిణాది సన్నాయి మేళం, నాదస్వరం, విద్వాన్ కన్నయ్య బృందం ఆధ్వర్యంలో వాయిద్య కచేరీ జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

నేడు గొటివాడ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

కురుపాం: మండలంలోని గొటివాడ గ్రామ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీ వాణి బుధవారం భూమిపూజ చేయనున్నారు. రూ.1.6 లక్షల వ్యయంతో 1.6 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించనున్నారు. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం తరలింపు



కాట్రగడ వద్ద రోడ్డు పక్కనే ధాన్యం తూస్తున్న కళాసీలు

భామిని: మండలంలో కొనసాగుతున్న ఖరీఫ్ వరి కోతలు, నూర్పులతో సేకరించిన ధాన్యం తరలింపు జోరందుకొంది. గత రెండు రోజులుగా నిలిచిన ధాన్యం తరలింపు మంగళవారం మండల వ్యాప్తిగా ఆరంభమైంది. ఇంత వరకు కొన్ని రైస్ మిల్లు యజమానుల నిర్లక్ష్యంతో ప్రభుత్వం నుంచి ధాన్యం సేకరణకు అవకాశం లేక పోవడంతో కొద్ది పాటి మిల్లులలో అధికంగా ధాన్యం చేరి పోయాయి. ప్రభుత్వం అనుమతులు సడలించడంలో ట్రక్కుషీట్‌లకు అనుమతులు రావడంతో ధాన్యం కొనుగోలు మరోసారి స్పీడందుకొంది.

విద్యార్థులు బాగా చదవాలి : పీఓ



విద్యార్థులకు ప్రశ్నలు వేస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: విద్యార్థులు బాగా చదవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి అన్నారు. మల్లిలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. చదువులను పరిశీలించారు. ఏవైనా సబ్జెక్టులకు సంబంధించి సందేహాలుంటే వెంటనే ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకోవాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకులం విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ



క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న కానిస్టేబుల్ ఈశ్వరరావు

సీతంపేట: స్థానిక గిరిజన గురుకుల బాలుర కళాశాల విద్యార్థులకు శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన బిల్డర్ శివ 30 జతల క్రీడా దుస్తులు వితరణ చేశారు. వీటిని ఆయన స్నేహితుడైన భామిని మండలం బత్తిలిలో పోలీస్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఈశ్వరరావు చేతుల మీదుగా సీతంపేట గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో పంపిణీ చేశారు. హాకీ, కబడ్డీ, వాలీబాల్ వంటి క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్‌లు రవి, రాజేష్ పాల్గొన్నారు.

రూ.50 లక్షలతో ఆలయ నిర్మాణం

రాజాం: మండలంలోని మెంతిపేట గ్రామం వద్ద ఉమామృత్యుంజయ ఆలయ నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. రూ.50 లక్షల వ్యయంతో ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇటు మెంతిపేట, అమ్మవారి కాలనీలతో పాటు అటు రాజాం పట్టణానికి అందుబాటులో ఉండేలా ఆలయాన్ని నిర్మిస్తున్నామన్నారు.

కొత్తపింఛన్ దరఖాస్తుల పరిశీలన



సూరంపేటలో కొత్తపింఛన్ అర్జీదారులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్‌ఆర్డీ కె.కుమారవర్మ

సీతానగరం: అర్హులైన వారందరికీ పింఛన్ పథకం వర్తించాలనే సంకల్పంతో ఆన్‌లైన్ ద్వారా సేకరించిన దరఖాస్తులను గ్రామాలకు వెళ్లి పరిశీలిస్తున్నట్లు ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన సూరంపేటలో మాట్లాడుతూ ఎంపీడీఓ ఎంఎల్‌ఎన్ ప్రసాద్ సూచనల మేరకు సూరంపేట, జోగింపేట, గుచ్చిమి గ్రామాల్లో కొత్త పింఛన్‌ల కోసం వచ్చిన దరఖాస్తులను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్లు చెప్పారు. ఒక్కోగ్రామంలో 6 నుంచి 10 దరఖాస్తులు పింఛన్ కోసం వచ్చాయని, అర్జీదారులను భౌతికంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎంఎల్‌ఎన్ ప్రసాద్ గెడ్డలుప్పి, తామరఖండి, బగ్గందొరవలస గ్రామాల్లో పరిశీలించారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు బల్లుకోట బీటీ రోడ్డు ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న బల్లుకోట బీటీ రోడ్డు

కురుపాం: మండలంలోని టికరఖండి గ్రామం నుంచి బల్లుకోట గిరిజన గ్రామం వరకు నిర్మించిన బీటీ రోడ్డును బుధవారం ప్రారంభించనున్నారు. ఉదయం 11.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి హాజరై, రోడ్డును ప్రారంభిస్తారని పార్టీ మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే చొరవతో మంజూరైన రూ.1.76 లక్షల వ్యయంతో మూడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని ఆపాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నెయ్యిలవీధి ప్రజలు

కురుపాం: మండల కేంద్రంలోని నెయ్యిలవీధి రోడ్డును ఆక్రమించి, అక్రమంగా చేపడుతున్న ప్రహరీ నిర్మాణాన్ని ఆపాలని స్థానికులు కోరుతున్నారు. ఇదే విషయమై మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్‌ను కలిసి, వినతిపత్రం అందజేశారు. గతంలో ఇక్కడి వారి రాకపోకలకు వీలుగా రెవెన్యూ శాఖ రోడ్డు మంజూరు చేసిందని, ఇదే రోడ్డును టిక్కలి వెంకటరమణ అనే వ్యక్తి ఆక్రమించి, ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారని వివరించారు. తక్షణమే ఆ అక్రమ కట్టడాన్ని నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు.

భూసర్వేతో సత్ఫలితాలు



రైతులకు పాస్‌పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోన్న భూసర్వేతో సత్ఫలితాలు వస్తున్నాయని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. నీలానగరంలో ఇటీవల చేపట్టిన భూసర్వేతో రైతులకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చాయి. వీటిని సంబంధిత రైతులకు మంగళవారం ఎమ్మెల్సీ విక్రాంత్ అందజేశారు. రాష్ట్రంలో చేపడుతున్న భూసర్వే సాహసోపేతమైన నిర్ణయమని ఎమ్మెల్సీ అన్నారు. భావి తరాలకు వివాద రహిత భూమిని ఇవ్వాలనే లక్ష్యంతో భూసర్వేకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. పాస్ పుస్తకాల్లో ఏవైనా తప్పులు దొర్లితే వెంటనే సవరణ చేయాలని తహసీల్దార్ చందక సత్యనారాయణకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, సర్పంచ్ వావిలపల్లి పురుషోత్తమరావునాయుడు, వైస్ ప్రెసిడెంట్ మంగిపూడి రాంబాబు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అంతకు ముందు స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఎమ్మెల్సీ విక్రాంత్ ప్రారంభించారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి



రైస్‌మిల్లు వద్ద ధాన్యం సేకరణపై ఆరాతీస్తున్న జేసీ గోవిందరావు

గరుగుబిల్లి: ధాన్యం కొనుగోలు, తరలింపులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జేసీ(జాయింట్ కలెక్టర్) ఆర్.గోవిందరావు సూచించారు. మండలంలోని రావివలస జంక్షన్ దగ్గరున్న రైస్‌మిల్లును మంగళవారం పరిశీలించిన ఆయన ధాన్యం కొనుగోలు, సేకరణ, తరలింపు, ట్రక్ షీట్ల జారీపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ట్రక్ షీట్లు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు ధాన్యాన్ని తరలించాలన్నారు. మిల్లులకు వచ్చిన వ్యాన్లలోని ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేయాలన్నారు. దళారులను ఆశ్రయించి, మోసపోవద్దని రైతులకు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. రైతు పండించిన ప్రతీ ధాన్యం గింజనూ ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు.

దత్త జ్ఞానబోధ సభ

రేగిడి: స్థానిక దత్తపీఠంలో దత్త జ్ఞానబోధ సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణనాయుడు, దత్తపీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు మాస్టారు మాట్లాడుతూ భారతీయ సనాతన ధర్మం, సోదరసోదరీమణుల బంధాలు భారతీయ సాంస్కృతిక వైభవమని తెలిపారు. సమాజానికి ఆదర్శవంతంగా జీవనం సాగించాలన్నారు. గురువును దైవ సమానులుగా భావించి, గౌరవించాలన్నారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వక్తలు జద్దు జగ్గారావు, ఎన్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

మహిళా సంఘాల పనితీరు పరిశీలన

రాజాం: మండలంలోని గురవాంలో గ్రామ మహిళా సంఘాల పనితీరుపై వైఎస్సార్ క్రాంతి పథం ఏసీ ఎ.చిరంజీవి మంగళవారం సమీక్షించారు. మోనటరింగ్ మెకానిజంలో భాగంగా క్షేత్ర సందర్శన చేసి, సంఘం పనితీరు పరిశీలించినట్లు ఏసీ తెలిపారు. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో జిల్లా పీడీ కల్యాణ చక్రవర్తి ఆదేశాలతో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. గ్రామ సంఘం పుస్తకాలు తనిఖీతో పాటు, అప్పులు ఇవ్వడం, రుణాల వసూళ్ల, పొదుపు, వైఎస్సార్ ఆసరా లబ్ధి, వైఎస్సార్ సున్నా వడ్డీ, స్త్రీ నిధి అప్పులపై ఆరాతీశారు. కార్యక్రమంలో ఏపీఎం ఎస్.అప్పలనాయుడు, ఎఫ్‌పీఓ ఏపీఎం దధికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు'

• ఎమ్మెల్యే కళావతికి జన నీరాజనం



చలివేంద్రిలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను మహిళకు చూపిస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పేర్కొన్నారు. వీరఘట్టం మండలం చలివేంద్రి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ప్రతీ ఇంటిలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. ప్రతీ ఇంటికీ ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లలో అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కుటుంబంలో చదువుకునే పిల్లలకు అమ్మ ఒడి, విద్యాకానుక, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు, మహిళలకు వైఎస్సార్ ఆసరా, డ్వాక్రా మహిళలకు సున్నావడ్డీ రుణాలు ఇలా లెక్కకు మించి పథకాలు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా చలివేంద్రి పంచాయతీ పరిధిలో ఉన్న జె.గోపాలపురం, మహదేవివలస గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే కళావతికి తెలియజేశారు. వాటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు తమ ఇళ్లకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన ఎమ్మెల్యే కళావతికి ప్రజలు హారతులు పట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, సర్పంచ్ శిర్లాపు సుదర్శనరావు, ఎంపీటీసీ పోరెడ్డి వెంకటనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, వీఆర్‌ఓ పొన్నాడ రఘునాయుడు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు



స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది

పార్వతీపురంటౌన్: మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్సై పాపారావు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల మృతుల్లో ఎక్కువమంది మైనర్లే ఉంటున్నారన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపై కేసు నమోదు చేస్తామని, ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపేటప్పుడు విధిగా ధృవపత్రాలను వెంట ఉంచుకోవాలని స్పష్టం చేశారు. పెండింగ్ చలానాలు, రవాణాశాఖ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై ప్రత్యేక నిఘా పెట్టామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్సై కొండలరావు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు, సిబ్బంది సింహాచలం, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' మేట్‌లకు ఒక్కరోజు శిక్షణ

గుమ్మలక్ష్మీపురం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మండల స్థాయిలో రిజిస్టర్ అయిన మహిళా మేట్‌లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో జి.జగదీష్‌కుమార్ ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. మండలంలోని 27 పంచాయతీలకు సంబంధించి, 8 క్లస్టర్లుగా విభజించి, ఆయా క్లస్టర్లలోని ఎంపిక చేసిన కేంద్రాల్లో మేట్లకు ఈ నెల 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఒక్కో బ్యాచ్‌కు ఒక్కోరోజు చొప్పున శిక్షణ ఇవ్వనున్నామన్నారు. మండలంలో మొత్తం 282 మంది మహిళా మేట్లు ఉన్నారని, ఈ నెల 27వ తేదీన కేదారిపురం గ్రామ సచివాలయ భవనం వద్ద కేదారిపురం, నోంద్రుకోన, వంగర పంచాయతీలకు చెందిన మేట్లకు, అలాగే దుమ్మంగి ఎంపీపీ స్కూల్ వద్ద దుమ్మంగి, కుక్కిడి, రెల్ల పంచాయతీలకు చెందిన మేట్లకు, 28వ తేదీన కొండవాడ ఎంపీపీ స్కూల్ వద్ద కొండవాడ, లక్కగూడ, లుంబేసు పంచాయతీలకు చెందిన మేట్లకు, ఇరిడి ఎంపీపీ స్కూల్ వద్ద ఇరిడి, పెదఖర్జ, తాడికొండ పంచాయతీలకు చెందిన మేట్లకు, 29వ తేదీన గుమ్మలక్ష్మీపురం వైకేపీ కార్యాలయం వద్ద చెముడుగూడ, ఎల్విన్‌పేట, గుమ్మలక్ష్మీపురం, మండ, పి.ఆమిటి పంచాయతీలకు చెందిన మేట్లకు, అలాగే దుడ్డుఖల్లు జీటీడబ్ల్యూఏహెచ్ స్కూల్ వద్ద దుడ్డుఖల్లు, నెల్లికిక్కువ,వనకాబడి పంచాయతీలకు చెందిన మేట్లకు, 30వ తేదీన గద్రజోల ఎంపీపీ స్కూల్ వద్ద బీరుపాడు, చినగీసాడ,గొయిపాక, జర్న పంచాయతీలకు చెందిన మేట్లకు, అలాగే గొరడ ఎంపీపీ స్కూల్ వద్ద బాలేసు, చాపరాయి బిన్నిడి, రాయగడజమ్ము పంచాయతీలకు చెందిన మేట్లకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఈ శిక్షణకు మేట్లంతా తప్పనిసరిగా హాజరు కావాలని, ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు దీనికి బాధ్యత వహించాలని ఆయన కోరారు.

సీజీఎఫ్ నిధులు మంజూరు చేయండి



ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి క్యాలెండర్ అందజేస్తున్న తోటపల్లి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయాల అభివృద్ధికి సీజీఎఫ్ నిధులు మంజూరు చేయండి అని కోరుతూ ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.కరికాల్ వలెవన్‌కు వినతిపత్రాన్ని అందించినట్లు ఆలయ చైర్మన్ ఎం.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. తోటపల్లి ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యులతో కలిసి స్పెషల్ చీఫ్ సెక్రటరీని అమరావతిలో కలిసి వినతిపత్రాన్ని అందజేశామన్నారు. గతంలో నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, పునః నిర్మాణాన్ని తోటపల్లి టెంపుల్ డెవలప్‌మెంట్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో చేపట్టడం జరుగుతుందన్నారు. దేవాదాయ శాఖ కూడా నిధులు మంజూరు చేస్తే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎండోమెంట్ కమిషనర్ సత్యనారాయణతో చర్చించి, ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరుకు కృషి చేస్తానని స్పెషల్ చీఫ్ సెక్రటరీ తెలిపారన్నారు. ఆయనకు తోటపల్లి ట్రస్ట్ బోర్డు రూపొందించిన క్యాలెండర్‌ను అందజేశామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ట్రస్ట్ బోర్డు సభ్యులు బి.పారినాయుడు, డి.ధనంజయరావు, కొండలరావు, తదితరులు ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తెర్లాం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శంబంగి రామకృష్ణ ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ట్యాబ్‌ల పంపిణీ..

తెర్లాం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ట్యాబ్‌ల పంపిణీ బుధవారం చేపట్టనున్నట్లు ఎంఈవో త్రినాధరావు ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, ఎంపీడీవో శంబంగి రామకృష్ణ హాజరు కానున్నారని ఆయన పేర్కొన్నారు.